## జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్ బోల్తా

### -20 టన్నుల ఆయిల్ నేలపాలు




పెళ్లకూరు జూన్ 22 ప్రభాతవార్త:
పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి పై గుర్రపు తోట సమీపంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కృష్ణపట్నం నుండి శ్రీకాళహస్తికి పామాయిల్ లోడ్ తో వెళుతున్న ట్యాంకరు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 20 టన్నుల పామాయిల్ నేలపాలు కాగా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం గురించి సమాచారం తెలుసుకున్న డివిజన్ ఎస్సై ఆదిలక్ష్మి మరియు పెళ్ళకూరు ఏఎస్ఐ మునుస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరగడానికి కావలసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు ప్రమాదానికి గురైన డ్రైవర్ను 1033 అంబులెన్స్ ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పట్టపగలే రోడ్డుపై నెమళ్ల సంచారం

శాంతిపురం, జూన్ 22 ప్రభాతవార్త



పట్టపగలే నెమళ్లు రోడ్లపై సంచరిస్తూ ఆదివారం కన్పించాయి. మండలం లోని గుండిశెట్టిపల్లి - ఎంకెపురం మార్గంలో ఉయ్యాల జయరాంరెడ్డికి చెందిన ఫామ్‌హౌస్ వద్ద సుమారు పది నెమళ్లు సంచరిస్తూ అటుగా వచ్చి వెళ్లే వారిని ఆశ ్చర్యపర చాయి. సాధారణంగా అటవీ ప్రాంతంలో ఉండాల్సి న నెమళ్లు ఆహార అన్వేషణలో భాగంగా ఇలా వచ్చి ఉంటాయని స్థానికులు పేర్కొన్నారు.

# తోతాపురి మామిడి మట్టిపాలు

**- రైతులకు చుక్కలు చూపిస్తున్న పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు**
**- పల్ప్ ఫ్యాక్టరీలు కేజీకి రూ.5, ర్యాంపులు కేజీకి రూ.3 చెల్లింపు**
**- జిల్లాలో ఎక్కడా అమలు కాని ప్రభుత్వ ఉత్తర్వులు**

చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:
వేల రూపాయలు ఖర్చు పెట్టి మామిడి సాగు చేసిన రైతుకు ఈ సీజన్‌లో చేదు అనుభవం ఎదురవుతోంది. తోతాపురి మామిడికి మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడంతో మామిడి రైతులు తన పంటను మట్టిపాలు చేస్తున్నాడు. తోతాపురి మామిడికి ప్రభుత్వం కేజీకి రూ.12 మద్దతు ధర ప్రకటించింది. ఇందులో ప్రభుత్వం కేజీ తోతాపురి మామిడికి రూ.4 సబ్సిడీ రూపంలో రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయనుండగా మిగిలిన కేజీపై రూ.8 పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు మామిడి రైతుకు చెల్లించాల్సి వుంది. అయితే జిల్లాలో ఎక్కడా ప్రభుత్వం నిర్ణయించిన ధర తోతాపురి మామిడి రైతుకు పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద లభించడం లేదు. ఇప్పటికే పెట్టుబడి ఖర్చుల కింద వేల రూపాయలు ఖర్చు పెట్టి రైతు తోతాపురి మామిడి సాగు చేసినప్పటికీ ప్రస్తుతం మళ్ళీ మామిడి కోతలు కోసి, ఆపై రవాణా ఖర్చులు పెట్టుకుని పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్దకు వెళ్ళి రైతు పడిగాపులు పడి తన పంటను విక్రయించుకోవాల్సి న పరిస్థితి నెలకొంది. అయితే జిల్లాలో ఎక్కడా ప్రభుత్వం నిర్ణయించిన తోతాపురి మామిడి మద్దతు ధరను పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు ఇవ్వడం లేదు. పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు మామిడి రైతుకు కేజీ తోతాపురిపై ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రూ.8 చెల్లించాల్సి వుండగా జిల్లాలో ఏ ఒక్క పల్ప్ ఫ్యాక్టరీ, ర్యాంపులు ఆ మేరకు రైతుకు చెల్లించడం లేదు. పల్ప్ ఫ్యాక్టరీలు రైతుల నుండి తోతాపురి మామిడి కేజీకి రూ.5 వరకు చెల్లిస్తుండగా ర్యాంపుల యాజమానులు మాత్రం మరింత తగ్గించి రైతుకు కేజీ తోతాపురి మామిడిపై రూ.3 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీ కింద రైతుకు కేజీపై రూ.4 చెల్లిస్తామని చెప్పినప్పటికీ ఆ మొత్తం ఎప్పుడు చెల్లిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే



పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల యాజమానులు సైతం మామిడి రైతుకు ఇప్పటికిప్పుడు డబ్బులు చెల్లించకుండా కేవలం రైతు ఎంత మొత్తంలో మామిడి కాయలు సరఫరా చేశాడనే వివరాల స్లిప్పులు మాత్రం ఇస్తుండటంతో రైతుకు దిమ్మ తిరుగుతుంది. మామిడి కోతలతో పాటు రవాణా ఖర్చులకు ట్రాక్టర్, లారీల బాడుగలకు సైతం డబ్బులు ఇవ్వని పరిస్థితి రైతు ఎదుర్కొంటుండటంతో అత్యధిక రైతులు ఇప్పటి వరకు మామిడి సాగుకు చేసిన ఖర్చును సైతం వదులుకోవడానికి సిద్ధపడి మామిడి కాయలను చెట్లలోనే వదలి వేయడానికి సిద్ధమవుతున్నారు. ఒకవేళ రైతులు ఎలాగోలా తోతాపురి మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్దకు వెళ్ళి విక్రయించాలని బయలుదేరిన రైతులకు చుక్కలు కన్పిస్తున్నాయి. ఫ్యాక్టరీల వద్ద మామిడి లోడ్లతో ట్రాక్టర్లు, లారీలు బారులు తీరి వుండటం, ఫ్యాక్టరీలు ఎప్పుడు రైతులకు టోకెన్లు జారీ చేస్తారో తెలియని పరిస్థితి వుండటంతో ఇంటిని వదలి వచ్చిన రైతులు ఫ్యాక్టరీల వద్దే రెండు మూడు రోజులు పడిగాపులు పడి వుండే పరిస్థితి నెలకొంది. ఇంత కష్టపడినప్పటికీ తమ వెనుక మళ్ళీ మామిడి ట్రాక్టర్ లోడ్లు వస్తుండటం, ఫ్యాక్టరీలు రోజుకు పరిమితంగా టోకెన్లు జారీ చేస్తుండటంతో ట్రాక్టర్లలో నిల్వ వున్న మామిడి పంట పక్వానికి వచ్చి కుళ్ళిపోయే పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులను జిల్లా అధికారులు తనిఖీ చేసి రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మద్దతు ధర ఇవ్వాలని స్పష్టం చేస్తున్నప్పటికీ ఫ్యాక్టరీ యాజమానులు అధికారుల ఎదుట తల ఊపి వారు వెళ్ళిన అనంతరం రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయాలని రైతులు భావించినప్పటికీ ఆశించిన ఫలితం వుండదని అత్యధిక రైతులు ఫ్యాక్టరీల యాజమాన్యంపై ఫిర్యాదు చేయడం లేదు. ఫ్యాక్టరీలు చెల్లించిన మొత్తం తీసుకెళ్ళడానికి అత్యధిక రైతులు సిద్ధంగా వున్నప్పటికీ వారికి టోకెన్లు ఇవ్వడంలో ఫ్యాక్టరీలు జాప్యం చేస్తుండటంతో రైతుల్లో నిరాశ వ్యక్తం అవుతోంది.

### రేపు బంగారుపాళ్యంలో వైకాపా ఆధ్వర్యంలో ధర్నా

తోతాపురి మామిడి రైతులకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకువైకాపా ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డు ఎదుట రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి మామిడి రైతులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో తరలిరావాలని పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని బంగారుపాళ్యం, పూతలపట్టు, యాదమరి, తవణంపల్లి, ఐరాల మండలాలకు చెందిన మామిడి రైతులతో పాటు వైకాపా నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

## కల్వర్టును ఢీకొట్టిన కారు దగ్ధం

### దంపతులు మృతి.. పిల్లలకు తీవ్రగాయాలు





చంద్రగిరి, జూన్ 22 ప్రభాతవార్త:
కారు కల్వర్టును ఢీ కొట్టిన ప్రమాదంలో దంపతులు మృతి చెందిన సంఘటన ఆదివారం కల్‌రోడ్ పల్లి సమీపంలో చోటుచేసుకున్నది. వివరాలిలావున్నాయి. గుడిపాల మండలం, కుప్పిగాని పల్లికి చెందిన సిద్దయ్య, జ్యోతి, కుమార్తె గాయత్రి, కుమారుడు గిరి కారులో తిరుమల నుండి సొంతూరుకు వెళుతుండగా పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి కల్‌రోడ్ పల్లి పంచాయతీ, గెడ్డక్రింద పల్లి వద్ద కారు కల్వర్టును వేగంగా ఢీ కొట్టుకుని పొగలు చిమ్మడంతో వాహనచోదకులు, స్థానికులు దంపతులను, పిల్లలను కారు నుండి బయటకు దించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా మంటల్లో చిక్కుకుని కాలిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సిద్దయ్య (43), జ్యోతి 38) సంఘటనా స్థలిలోనే తుది శ్వాస విడిచారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్ట నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

**చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గన్‌మ్యాన్‌గా పనిచేస్తున్న సిద్దయ్య**

మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డికి ప్రైవేటు గన్‌మ్యాన్ పనిచేస్తున్న సిద్దయ్య ఆదివారం తన పుట్టిన రోజు కావడంతో కుటుంబంతో కలసి తిరుమలకు వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై దంపతులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇదిలా వుండగా తమకు ఎంతో నమ్మకంగా వుంటున్న సిద్దయ్య ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హుటాహుటిన తిరుపతి రుయాకు చేరుకుని మెరుగైన వైద్యం కోసం గాయత్రి, గిరిలను స్విమ్స్ కు తరలించారు. పిల్లలకు అవసరమైన వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## నైరుతి నిరాశ

**- మబ్బులు కమ్మినా కురవని వాన**



కోట, జూన్ 22 ప్రభాతవార్త
నైతుతి రుతుపవనాలు విస్తరించాయి.. మబ్బులు కమ్ముకుంటున్నాయి.. మేఘాలు మురిపిస్తున్నాయి.. కానీ చినుకు రాలడం లేదు. ఒక వేళ ఎక్కడైనా వర్షం పడినా అక్కడక్కడా చినుకులే తప్ప పదును వాన కురవడం లేదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించాయి. ఆశాజనకంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. వాస్తవానికి జూన్‌లోనే రైతులు దుక్కి దున్ని విత్తనాలు నాటుతారు. కానీ జూన్ నెల సగం గడిచినా వర్షాల జాడలేదు. దీంతో ఇంకా ఏరువాక ప్రారంభించని అన్నదాతలు వాతావరణ శాఖ ఊరింపులతో వర్షాల కోసం రోజంతా మేఘాల వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. పొలాల్లో నీరు పెట్టడానికి చెరువుల్లో జలాశయాలు నింపడానికి అవసరమైన వర్షపాతంలో నైరుతి రుతుపవనానే 60 శాతానికి పైగా నీళ్లు అందిస్తాయి. జిల్లాలో 70 శాతం సరైన నీటి పారుదల లేదు. ఏటా జూన్, సెప్టెంబర్ మాసాల మధ్య రుతుపవనాల వర్షాలే ఆధారం. గత ఏడాది సంవృద్ధిగా వర్షాలు కురవడం, ప్రాజెక్టులు నిండటంతో రైతులు పంటలను విస్తారంగా సాగు చేపట్టారు. మెట్ట పైర్లు చేసే పొలాలను రైతులు దుక్కి దున్నారు. అయితే వాతావరణం అనుకూలించలేదు. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే పంటలు సాగయ్యే పరిస్థితి లేదు. వరుణుడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

### భయపెడుతున్న

## నకిలీ దర్శన టిక్కెట్లు

**-టిటిడి విజిలెన్స్‌కు తలనొప్పి వ్యవహారం**



ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:
తిరుమలేశుని నకిలీ దర్శన టిక్కెట్లు సామాన్య భక్తులను భయపెడుతున్నాయి. నకిలీటిక్కెట్ల గోల్ మాల్ వ్యవహారం టిటిడి విజిలెన్స్ వింగ్‌కు తల నొప్పిగా తయారైంది. అసలు నకిలీ టిక్కెట్లు సృష్టించి భక్తులను సులభంగా మోసం చేస్తున్న మోసగాళ్ళకు చెక్‌పెట్టాల్సి న టిటిడి విజిలెన్స్,తిరుమల పోలీసులు మరింత కఠినంగా దర్శన టిక్కెట్లు ఎక్కడ సృష్టిస్తున్నారు, ఎవరు ఈ బాగోతానికి పాల్పడుతున్నారనేది ఆరాతీయాల్సి ఉంది. భక్తులు తమతో తీసుకువచ్చిన దర్శన టిక్కెట్లు నిజమైనవా,నకిలీవా అనేది తెలుసుకోలేకపోతుండటంతో తిరుమలకు వచ్చి వైకుంఠమ్ క్యూలైన్లోకిప్రవేశిస్తేగానీ తెలియడం లేదు. భక్తులు మాత్రం తలలుపట్టుకునే పరిస్థితి వస్తోంది. రోజురోజుకూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపవుతుండటంతో అందుకు తగ్గట్లు భక్తులు కూడా చాలా సులభంగా స్వామివారిని దర్శనం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇలా భావిస్తున్న వారికి మోసగాళ్ళు, దళారులు సులభంగా దర్శన టిక్కెట్లు ఇప్పిస్తామని నమ్మించి భక్తులను నకిలీ టిక్కెట్లతో దగాచేస్తున్నారు., ఈ నకిలీ టిక్కెట్ల దందా తిరుమలలో తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఒకటేమిటీ వేకువజామున శ్రీవారికి జరిగే సుప్రభాతసేవ, 300 రూపాయలు ఎస్ఇడి దర్శన టిక్కెట్లు అధికంగా నకిలీవి తీసుకుని భక్తులు దర్శనానికి వస్తున్నట్లు గుర్తించారు. ఇటీవల గత మార్చినెలలో విజయవాడ సిద్ధార్థ వైద్యకళాశాల వైద్యవిద్యార్థిని డి.సంగమిత్రకు శ్రీవారిసుప్రభాతసేవ, ప్రోటోకాల్ దర్శనం, వసతి టిక్కెట్లు ఇప్పిస్తామని మదనదీపుబాబుఅనే సందీప్, పవన్‌కుమార్ 2.60లక్షలు రూపాయలు వసూలుచేశారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. భక్తుల అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న కొందరు కేటుగాళ్ళు నకిలీ దర్శన టిక్కెట్ల వ్యాపారానికి తెరలేపారనేది విజిలెన్స్ అధికారుల అనుమానాలు. కొందరు దళారులు ఏమాత్రం భయం లేకుండా నకిలీ టిక్కెట్లుతో ఆధార్‌నంబర్ మార్ఫింగ్‌చేసి టిక్కెట్లు ఇస్తున్నారనేది ఉన్న సమాచారం. టిటిడి విజిలెన్స్ వింగ్ విఎస్‌ఓ ఎస్టీవి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపడుతుంటారు.

**నకిలీ టిక్కెట్లతో మోసంచేస్తే కఠిన చర్యలు: సివిఎస్ఓ మురళీకృష్ణ**

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం పేరుతో భక్తులకునకిలీ టిక్కెట్లు ఇస్తే కఠిన చర్యలు తప్పవని టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ హెచ్చరించారు. భక్తులు కూడా దళారుల మాయమాటలు నమ్మవద్దని, టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లోనే దర్శన టిక్కెట్లు బుక్‌చేసుకోవాలని కోరారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు నకిలీ దర్శన టిక్కెట్లతో మోసం చేస్తున్న దళారుల విషయాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దళారులపై ప్రత్యేక నిఘా వుంచామన్నారు. టిటిడి విజిలెన్స్ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని, 0877-2263828 నంబర్‌కు ఫోన్‌చేసి అనుమానాలను భక్తులు నివృత్తిచేసుకోవాలని ,అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## దేవుడా నీ దర్శనం త్వరగా కలిగించు !

### బారులు తీరిన క్యూలైన్లు





తిరుమల,జూన్ 22 ప్రభాతవార్తప్రతినిధి:
వారాంతం ,వరుససెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. ఆదివారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సి న పరిస్థితి ఉంది. ఈ రద్దీ ఇలాగే జులై 15వరకు కొనసాగుతుందని టిటిడి వర్గాల అంచనా. ఆదివారం సాయంత్రానికి 44వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. శనివారం రాత్రివరకు 90,087మంది భక్తులు మహాలఘులో శ్రీవారిని దర్శనం చేసుకున్నారు.

## హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత



**30 మంది ఆస్పత్రిపాలు**

4లో

## దళిత అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు తీవ్ర అవమానం

తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాతవార్త
తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న రవివర్మ సెలవుపై వెళ్లి శనివారం విధులకు వచ్చారు. తన ఛాంబర్లోకి వెళ్లిచూడగా టేబుల్,కుర్చీలు తొలగించి ఉండటం చూసి ఒక్కసారిగా కంగుతిన్నారు. దీనిపై కళాశాల సిబ్బందితో ఆరా తీయగా ప్రిన్సిపాల్ తొలగించారని చెప్పారు. దీంతో నేలపై కూర్చుని తన విధులను నిర్వర్తించారు. కళాశాల విద్యార్థుల ముందు తనను అవమానించడంతో ఆయన మనస్తాపానికి గురై వీసీకి ఫిర్యాదు చేశారు.

***- దళితుడనే కారణంతోనే నన్ను వేధిస్తున్నారు..***

ఈ ఘటనపై బాధితుడు రవివర్మ మాట్లాడుతూ.. ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో ఎస్సీ ఉద్యోగులపై ఓ వర్గం అరాచకాలకు పాల్పడుతోంది అని, డెయిరీ కళాశాలలో ఎనిమిదేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నాను అని, ఇక్కడ రాజకీయాలు,వర్గపోరు తారా స్థాయిలో రాజ్యమే ఏలుతున్నాయి. పలుమార్లు డెయిరీ కళాశాల ప్రిన్సి పాల్ నన్ను ఎన్నో సార్లు అవమానిస్తూ వచ్చినా భరించాను. దళితుడిననే కారణంతో మానసికంగా కూడా ఇబ్బందులకు గురిచేశారు. శనివారం అకారణంగా నాచాంబర్ లోకి వచ్చి టేబుల్, కుర్చీలను తొలగించారు. కంప్యూటర్,ప్రింటర్, ఫైల్స్ ను చెల్లాచెదురుగా కింద పడేసి వెళ్లారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా పట్టించుకోకుండా సమాధానం దాటవేశారు. దీంతో వీసీ ని కలిసి ఫిర్యాదు చేశాను. వీసీ నా ఛాంబర్ లోకి వచ్చి పరిస్థితిని గమనించి ప్రిన్సిపాల్ ను వివరణ కోరేందుకు ఫోన్చేయగా ఆయన వీసీ కాల్కు సైతం సరైన సమాధానం ఇవ్వలేదని చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం అని వీ సి రమణ తెలిపారు. ఈ విషయం పైన పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు వామపక్ష పార్టీ నాయకులు.

# విద్యుత్ సరఫరా మాయాజాలం : ప్రజలకు శాపం- రైతులకు శాపం

**శ్రీకాళహస్తి విద్యుత్ సబ్‌డివిజన్‌లో కరెంటు రాకడ ప్రాణం పోకడ అన్నట్లు మారింది. గతంలో పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో కరెంటు కోత,మంచినీటి కొరత అనేది జనం ఎరుగరు.అయితే ప్రస్తుతం విద్యుత్ శాఖ పని తీరో లేక పై నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయమో కానీ ఎడా పెడా కోతలు విధిస్తున్నారు. మరి లైన్ల పరిస్థితి ఏమిటో ఏమా కానీ పగలు రానరతి తేడా లేకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.**

శ్రీకాళహస్తి, జూన్ 22 ప్రభాతవార్త
ఒక్కొక్క సీజన్‌లో ఒక్కొక్క సమస్యతో రైతులు తల్లడిల్లుతున్నారు. ఒక సీజన్లో విత్తనాల కొరత మరో సీజన్‌లో యూరియా కొరత మరోసారి అతివృష్టి,అనావృష్టితో తల్లడిల్లుతున్న రైతులకు ప్రస్తుతం ముందస్తు ఖరీప్‌లోని పంటలను కాపాడుకొనుటకు రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారింది. ముందస్తు ఖరీఫ్ పంటలను వేసిన రైతులకు 'విద్యుత్ సరఫరా మాయాజాలంతో' తల్లడిల్లుతున్నారు. గ్రామాల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో ఏమో? తెలియని స్థితి చోటు చేసుకుంది. 9 గంటల కరెంటు మాట దేవుడెరుగు కనీసం కయ్యల్లో నీరు పారే వరకు కూడా విద్యుత్ సరఫరా ఉండటం లేదని అన్నదాతలు అల్లాడుతున్నారు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో ఎండ వేడిమికి జనం తట్టుకోలేక పోతున్నారు. ఓ వైపు ఉక్కపోత మరో వైపు వాయుదేవుని కరుణ



కరువై ఇళ్ళలో ఉండలేని స్థితి చోటు చేసుకుంది.

**ఎండుతున్న పంటలు: కుములుతున్న అన్నదాతలు:**

అప్పులు చేసి పంటలు వేసిన రైతులకు ప్రస్తుతం విద్యుత్ సరఫరా శాపంగా మారింది,బావి,బోరు నిండా నీరున్నా దానిని పైకి తీయటానికి అవసరమైన విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఏమో తెలియని స్థితి దాంతో అన్నదాతలు రేయింబవళ్ళు పంటపొలాల్లో కునుకు తీయాల్సి న స్థితి చోటు చేసుకుంది. దాంతో కళ్ళెదుటే పచ్చటి పొలాలు ఎండిపోయే దుస్థితి చోటు చేసుకుంది. ముఖ్యంగా తొట్టంబబేడు మండలంలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక్కడ భూగర్భజలాలు బాగున్నాయి. అంతేకాక పంటలకు అవసరమైన నీరు 'తెలుగుగంగ ద్వారా' సరఫరా అవుతుంది. కాలువ నిండా నీరున్నా రైతు కంట కన్నీరు తప్పటం లేదు. రోజుకు 7 గంటలు కూడా కరెంటు ఇవ్వలేని దుస్థితి చోటు చేసుకుంది. ముఖ్యంగా సాయం సంధ్యవేళ క రెంటు ఉండటం లేదని వాపోతున్నారు.

**9గంటల కరెంటు సరఫరా మిథ్య!**

**తూర్పు మండలాల్లో నీటికి కొరత లేదు . . . కానీ . . .**

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో సుమారు 450 చెరువులున్నాయి. అంతేకాక బోర్లు, బావులు, తెలుగుగంగ కాలువ,జీవనది సువర్ణముఖి ద్వారా నీటిని సరఫరా చేస్తుంది. మండువేసవిలో ఇక్కడ ముందస్తు ఖరీఫ్ సీజన్లో పంటు పండిస్తున్నారు. తిరుపతి నుంచి బయలు దేరితే తడ వరకు పచ్చటి పొలాలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. రైతులు,కూలీలు పంట పొలాల్లో పనులు చేసుకుంటూ కనబడతారు. అయితే ప్రస్తుతం విద్యుత్ సరఫరా రైతుల్ని కంటిమీద కునుకు లేకకుండా చేస్తుంది. అయితే విద్యుత్ శాఖ అధికారులు ఎన్ని గంటలు కరెంటు ఇస్తారో ముందుగా ప్రకటిస్తే దాని ప్రకారం రైతులు ఏర్పాట్లు చేసుకుంటారు. కానీ ప్రజలు,రైతులతో అధికారుల మమేకం కరువైంది. పంటలకు తెగుళ్ళు ఓ శాపం కాగా ఈ సారి కరెంటు సమస్య జటిలంగా మారింది. ఇచ్చే కరెంటు కూడా మధ్య మధ్యలో ఆపి వేయటంతో తడులు వేయలేక తల్లడిల్లిపోతున్నారు. అధికారులు స్పష్టంగా ప్రకటించాలి. ఇక బుధవారం ఓ రోడ్డును ప్రారంభించటానికి వచ్చిన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని తొట్టంబేడు రైతులు విద్యుత్ సరఫరాలో అంతరాయం అస్తవ్యస్తం గురించి పిర్యాదు చేసారు. ఆయన వెంటనే స్పందిస్తూ ఏ గ్రామానికి 9గంటలు కరెంటు కావాలో కోరుకుంటే అక్కడ ఇస్తారని ప్రకటించారు.

# అనారోగ్యంతో ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ మృతి



చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త: స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ అనారోగ్యంతో మృతి చెందారు. మృతి చెందిన ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణ భార్య మల్లీశ్వరికి ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పోలీసు శాఖ తరపున ఫ్లాగ్ ఫండ్ రూ.25 వేలు, విడో ఫండ్ రూ.50 వేలు, అంత్యక్రియల ఫండ్ రూ.25 వేలను ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌బాబు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ మనోహర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ పోలీసు శాఖ పోలీసు కుటుంబాలకు ఎప్పుడు అండగా నిలుస్తోందని, పోలీసు సిబ్బందికి ఎదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు వారి కుటుంబసభ్యులకు తగిన సహాయం అందించడానికి పోలీసు శాఖ సిద్ధంగా వుంటుందన్నారు. పోలీసు కుటుంబాల సంక్షేమం పోలీసు శాఖకు అత్యంత ముఖ్యమని అవసరమైన సమయంలో పోలీసు శాఖ పూర్తి స్థాయిలో వారికి అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, సభ్యులు, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వైకాపా మండల నూతన కమిటీ నియామకం

చౌడేపల్లి, జూన్ 22 ప్రభాతవార్త

వైకాపా మండల నూతన కమిటీ నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే మండలాధ్యక్షుడుగా గౌడప్పగారి నాగభూషణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ప్రస్తుతం నియామకమైన నూతన కమిటీ...ఉపాధ్యక్షులుగా కొండపల్లి రమణ, వెంకట్రమణ, అమరనాథ్, ప్రధాన కార్యదర్శులుగా ఠాణాదార్ నాగరాజ, రమేష్, హరీష్‌రాయల్, కోశాధికారిగా విజయ్‌కుమార్, కార్యదర్శులుగా యశ్వంత్‌రాజు, రాజారెడ్డి, అల్తాఫ్, గిరి, మంజునాథ్‌రెడ్డి, మరో 20మంది కార్యవర్గ సభ్యులుగా నియమిస్తూ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మండల నూతన కమిటీ సభ్యులకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## తిరుమణిపల్లి పెళ్ళింట పెద్దిరెడ్డి

చౌడేపల్లి, జూన్ 22 ప్రభాతవార్త



పెళ్ళింట్లో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సందడి చేసాడు. మండలంలోని పుదిపట్ల పంచాయతీ తిరుమణిపల్లికి చెందిన వైకాపా సీనియర్ నాయకుడు శేఖర్ కుమార్తెకు ఇటీవల వివాహమైంది. దీంతో నూతన వధూరులను పెద్దిరెడ్డి ఆశీర్వదించారు. చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్ప, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్, మండల వైకాపా అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, నాయకులు రవిచంద్రారెడ్డి, గ్రెంధెం మంజునాథ్, పద్మనాభరెడ్డి, నవీన్, వెంకట్రమణ వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాడిఆవు మేసిందని తల్లీ కూతుళ్ళపై దాడి



ఎ.కొత్తకోట(చౌడేపల్లి), జూన్ 22 ప్రభాతవార్త

పాడిఆవు మేసిందని తల్లీ, మైనర్ బాలికలపై దాడి చేసిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితురాళ్ళ కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోటకు చెందిన మైనర్ బాలిక తన పొలంలో పాడి ఆవును మేపుకొంటూ ఓ చెట్టుకు కట్టి ఇంటికి వెళ్ళింది. తాడును తెంచుకొన్న ఆవు పక్కనే వున్న పొలంలోకి వెళ్ళి మేతమేసింది. దీంతో అదే గ్రామానికి చెందిన రమణమ్మ, సుజాతలు అక్కడికి వచ్చిన మైనర్ బాలికపై దాడి చేశారనీ, అక్కడవున్న తాను వెళ్ళి వారిని అడ్డుకొనే ప్రయత్నం చేయగా తనపై సైతం దాడి చేశారని బాలిక తల్లి మంజుల వాపోయింది. ఇరువురిని స్థానికులు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## బ్రాహ్మణ కాలువ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



రామచంద్రాపురం, జూన్ 22 ప్రభాతవార్త

బ్రాహ్మణ కాలువ అభివృద్ధికి ప్రణాళి కలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఆయన బ్రాహ్మణ కాలువను పరిశీలించారు. వరదనీరు గ్రామానికి రాకుండా కాలువలను మరమ్మత్తులు చేయాలన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో సర్వే చేసి పనులు ప్రారంభించాలన్నారు. గ్రామా భివృద్ధికి సుమారు రూ. 35 లక్షలు మంజూరు చేశామన్నారు. అనంతరం రావిళ్ళ వారిపల్లెకి చేరు కుని ఇటీవల వివాహం చేసుకున్న ధీరజ్‌కు మార్, నివేతలను ఆశీర్వదించారుటీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులు నాయుడు, నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, నరసింహారెడ్డి, మునిరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరై అక్కడ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## నేడు పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకుంటే వాటిని క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు.

## గోసంరక్షణ ట్రస్టుకు రూ.1 లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అమలు జరుగుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్టుకు ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. తిరుపతికి చెందిన మురుగన్ బోర్‌వెల్స్ అధినేత బోస్‌నాయుడు అనే భక్తుడు ఈ పథకానికి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యన్నదాన పథకానికి మరో 50 వేల రూపాయలను ఆయన అందజేశారు. ఈ మొత్తంను దాత కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరిటెండెంట్ కోదండపాణికి అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## నేడు వైకాపా యువత పోరు

చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:

ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన సిఎం నారా చంద్రబాబునాయుడు తీరుని నిరసిస్తూ సోమవారం చిత్తూరులో వైకాపా యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు నిర్వహించడానికి వైకాపా నాయకత్వం సిద్ధమైంది.

ఈ మేరకు సోమవారం ఉదయం 9.30 గంటలకు చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని వైకాపా యువజన నాయకులు, కార్యకర్తలు చిత్తూరు-వేలూరు రహదారిలోని ఆమూల్ డైరీ వద్దకు చేరుకోవాలని నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. అక్కడి నుండి వైకాపా యువజన విభాగం నాయకులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా కలెక్టరేట్ వరకు వెళ్ళి అక్కడ నిరసన తెలియజేసి ఆపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించనున్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం సూపర్‌హిట్

– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, జూన్ 22 ప్రభాతవార్త

వైజాగ్ నగరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంసూపర్‌హిట్‌గా నిలిచిందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం శాంతిపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు సమర్థవంతంగా తగు చర్యలు తీసుకుని కార్యక్రమం విజయవంతం చేశారన్నారు. ప్రధాని మోడీ ప్రపంచ దేశాల్లో యోగాను పాపులర్ చేయగా సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో విస్తృత ప్రచారం కల్పించారన్నారు. 175 దేశాల్లో యోగాను చేస్తున్నారన్నారు. విశాఖలో 3లక్షల మంది యోగాలో పాల్గొని రికార్డు సృష్టించారన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

## మామిడి రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలే దిక్కు!!

### సరైన ధరలు లేక రైతులు.. వ్యాపారులు విలవిల

### - పొరుగు రాష్ట్రాల్లోను తక్కువ ధరలు..

కుప్పం, జూన్ 22 ప్రభాతవార్త

పళ్లల్లో రాజుగా పేరున్న మామిడి కాయలకు బహిరంగ మార్కెట్లో సరైన ధరలు లేకపోవడంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు విలవిలలాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి కాయకు 12రూ.ల ధర ఇవ్వాలని ఇందులో ప్రభుత్వం రైతులకు 4రూ.లు చెల్లిస్తుందని పేర్కొంది. దీంతో రైతులు కొంత సంతోషపడ్డారు. తోతాపురి పంటను జిల్లాలో ఉన్న పల్ప్ ఫ్యాక్టరీలకు విక్రయించేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఈసారి పంట దిగుబడి సైతం అధికంగా రావడంతో పాటు ధరలు కూడా లేకపోవడం రైతులను కొంత నిరాశకు గురిచేశాయి. కాగా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సైతం పంట దిగుబడులు అధికంగా ఉన్న నేపథ్యంలో ఆంధ్ర ప్రాంతం నుంచి మామిడి పంటను కొనుగోలు చేసేందుకు అక్కడి ఫ్యాక్టరీల యాజమాన్యాలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అక్కడ కిలో తోతాపురి ధర రూ 7-8లకు మాత్రం అడుగుతున్నారని మామిడి సాగు చేసిన రైతులు 'ప్రభాతవార్త ప్రతినిధి'కి తెలిపారు. ఈధరలకు మామిడి పంటను విక్రయిస్తే పంట కోత కూలీ సైతం గిట్టుబాటు కాదని పేర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అయితే ప్రభుత ్వం రూ 12లకు రైతులనుంచి కిలో తోతాపురి కాయలు కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇప్పటికే పల్ప్ ఫ్యాక్టరీల యజమానులతో చర్చించి రైతులకు తగిన ధరలకు ఆదేశించారు.

## రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించింది

ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

పుంగనూరు రూరల్, జూన్ 22 ప్రభాతవార్త

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన పట్టణంలో పర్యటించారు. రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం దండగ అని వ్యాఖ్యానించిన చంద్రబాబు, రైతులకు గిట్టుబాటు ధరల కేటాయింపులో విఫలమయ్యారని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో టమోటా రైతులు కోట్లలో నష్టపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. తోతపురి కిలో రూ.2-3కు దిగజారడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. వైసీపీ హయాంలో రైతుల నుంచి టమోటా కొనుగోలు చేసి ఆదుకున్నట్టు గుర్తు చేశారు. రైతుల సమస్యలపై నిలబడే నేతలపై కేసులు పెడతారని మండిపడ్డారు.

## పిఎం కిసాన్ పేరుతో మోసం

సదుం, జూన్ 22, ప్రభాతవార్త

మండల పరిధిలో రైతులకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి పీఎం కిసాన్ డబ్బులు జమ చేయలేదనీ వైసిపి చిత్తూరు జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి తెలిపారు. అయితే సైబర్ నేరగాళ్లు పీఎం కిసాన్ పేరుతో ఫోన్ చేసి ఓటీపీ చెప్పమనడం లేదా అప్డేట్ చేసుకోమని చెప్పడం జరుగుతొందనీ చెప్పారు. ఎవరు పీఎం కిసాన్ రైతు భరోసా లేదా ఇంకా ఏమైనా ఏ పీకే అని ఎలాంటి ఫైల్స్ చెబితే షేర్ చేయకండి అని ఆయన కోరారు. ఒకవేళ అలా చేస్తే ఫోన్ హ్యాక్ అవడం లేదా ఫోన్ క్లోన్ అవడం జరిగి అకౌంట్స్‌లో ఉండే డబ్బులు తీస్తారనీ అలానే మెసేజెస్ పెడుతారనీ సూచించారు. ఏ పీకే ఫైల్స్ ఏది షేర్ చేయకూడదని ఇప్పటికే సదుం మండలంలో చౌక దుకాణ డీలర్ల సంఘం అధ్యక్షుడు హేమచంద్రారెడ్డి, అదేవిధంగా రైతు శ్రీనివాస్ అనే ఇద్దరి ఫోన్స్ హ్యాక్ అయ్యాయి అని తెలిపారు.

## సదుం మండల వైసీపీ కమిటీ ఏర్పాటు

సదుం, జూన్ 22 ప్రభాతవార్త

సదుం మండల వైసిపి కమిటీని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించినట్లు మండల వైసీపీ కమిటీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి తెలిపారు. కమిటీలో మండల ఉపాధ్యక్షులుగా మురళీమోహన్ నాయుడు, శ్రీధర్ రాజు, జనరల్ సెక్రటరీగా సురేందర్ రెడ్డి, సి నాగభూషణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చిన్న రమణ, సురేంద్ర, మోహన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, వై మనోహర్ రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులను నియమించినారని ఆయన ఆదివారం తెలిపారు.

## మాజీ ప్రధానోపాధ్యాయుడు కుటుంబానికి పరామర్శ



సదుం, జూన్ 22 ప్రభాతవార్త

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రాథమిక పాఠశాల మాజీ ప్రధానోపా ధ్యాయుడు కృష్ణారెడ్డి కుటుంబాన్ని ఆదివారం పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, తంబలపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, బోయకొండ ఆలయ మాజీ కమిటీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, ఎండపల్లి మనోహర్ రెడ్డి, వైసీపీ నాయకులు రాజారెడ్డి, పుత్రాజు, ఎల్లారెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యన్నదాన పథకానికి ఓ భక్తురాలు ఆదివారం ఒక లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ మేరకు నెల్లూరుకు చెందిన సుశీల అనే భక్తురాలు శాశ్వత నిత్యన్నదాన పథకానికి 1,00,116 రూపాయలను చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు. ఈ మొత్తంను దాత కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరిటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వామి వారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఉచిత యోగా తరగతులను సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు రూరల్, జూన్ 22 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో యోగా మాస్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వర ఆలయం ప్రాంగణంలోని, త్రినేత్ర పిరమిడ్ దివ్యధ్యాన మందిరంలో ప్రతిరోజు ఉదయం 5.15 నుంచి 6.30 వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా నేర్పిస్తున్నారన్నారు. పిరమిడ్ మాస్టర్లచే ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ధ్యాన మందిరంలో ఉచిత ధ్యానం కూడా నేర్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ యోగా వల్ల బీపీ, షుగర్ వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. పిరమిడ్ యోగా ధ్యానం వల్ల మెదడు ప్రశాంతంగా మారుతుందని, శరీరంలోని జీవశక్తి సమతుల్యం అవుతుందన్నారు.

## 25న అమావాస్య కూటం

పుత్తూరు రూరల్, జూన్ 22 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి ఆలయ తిరుణాళ్ళ సందర్భంగా ఈ నెల 25 తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆలయ కోవిల్‌కార్లు సాల్వాకం కిష్టప్ప మొదలి, ఏళుమలై మొదలియార్‌లు ఓ ప్రకటనలో తెలిపారు.

=====================

# ఎయిర్ బైపాస్ రోడ్డులో దర్జాగా మఠం భూమి ఆక్రమణ



తిరుపతిరూరల్, జూన్22 ప్రభాతవార్త:

తిరుపతిలో విలువైన హథీరాంజీ మఠం భూములు ఆక్రమణలకు గురైతున్నాయి. తాజగా రాస్ బిల్డింగ్‌కు ఎదురుగా ఉన్న మఠం భూమిని ఆక్రమణకు గురైన విషయాన్ని మఠం అధికారులు గుర్తించి, అడ్డుకున్నారు. కానీ మఠం అధికారులను ధిక్కరించి యదేచ్ఛగా ఆక్రమణ చేసారు. దీనిపై మఠం అధికారులు స్పందించాల్సి ఉంది. గతంలో మఠం అధికారులే స్వయంగా పరిశీలించి, మఠం భూమి ఆక్రమణకు గురైందని తేల్చి, బోర్డు కూడా ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు.

# సంఘమిత్ర చేతివాటం

### సుమారు 14 లక్షలు స్వాహా ! మహిళ సభ్యుల అవగాహన లోమే కారణమా ?

వెదురుకుప్పం, జూన్ 22 ప్రభాతవార్త :

పేద డ్వాక్రా మహిళ సంఘం సభ్యులకు ఆసరాగా ఉంటూ వారి పొదుపులు, అప్పుల లావాదేవీలు చూస్తూ ప్రభుత్వం మహిళ సంఘం సభ్యుల కొరకు అమలు చూస్తున్న పథకాల పై అవగాహన కల్పించడంకొరకు ఒక వివోకు ఒక సంఘమిత్ర(వివోఏ)ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. కంచే చేనే మేసిన చందంగా ఓ సంఘమిత్ర చేతి వాటం ప్రదర్శించి ఆ వివోలో సుమారు 14 లక్షల రూపాయాలు స్వాహా చేసిన్నట్లు చెబుతున్నారు. ఆ సంఘం మహిళ సభ్యుల కథనం మేరకు..మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోని వేణుగోపాలపురం గ్రామం యేసు వివో పరిధిలో 22 ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి. సంబంధిత సంఘమిత్ర చేతివాటం ప్రదర్శించి సంఘం సభ్యులకు ఇచ్చిన అప్పులు తిరిగి చెల్లించడం ఇచ్చిన నగదును, ఫోన్‌పే ద్వారా పంపిన మొత్తంను వివో బ్యాంకు ఖాతాకు జమ చేయకుండా చెల్లించిన్నట్లు పుస్తకాల నిర్వహణలో చూపించి మాయం చేసిన్నట్లు వాపోతున్నారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కూడ కారణమేనని చెబుతున్నారు. యేసు గ్రామసమైఖ్య పరిధిలో ఉన్నతి పథకం ద్వారా మహిళ సంఘాల నుంచి 8,14,992 రూపాయలు రావలసి ఉండగా క్షేత్రస్థాయిలో 1,84,600 రావలసి ఉందని చూపుతున్నారు. అంటే 6,30,392 రూపాయాలు తేడా ఉంది. అలాగే గ్రామ సమైఖ్య ఆర్.సిఐఎఫ్(రేస్లెక్లింగ్ ఫండ్) 13,73,000 రావలసి ఉండగా 6,24,460 రూపాయాలు చూపుతున్నారు. అంటే 7,48,540 తేడా ఉంది. స్త్రీనిధి మొత్తం 15,943 మాత్రం సరిపోయిందన్నారు. 13,78,932 రూపాయాలు స్వాహా చేసిన్నట్లు చెపుతున్నారు.





: చిట్టెమ్మ, షీకారు కాలనీ. వాణిశ్రీ, షీకారు కాలనీ

**చేయవలస్సి ంది ఇలా :**

గ్రామసమైఖ్య పరిధిలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఒక అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కోశాధికారిని ఎంపిక చేసుకోవడం జరుగుతుంది. నెల నెల సమావేశం ఏర్పాటు చేసుకుని అప్పులు, పొదుపులు, స్త్రీనిధి నగదును వసూలు చేసిబ్యాంకు ఖాతాలో జమ చేసి రశీదులు సంఘమిత్రకు ఇవ్వాల్స ఉంటుంది. సంఘమిత్ర వాటిని ప్రతి ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లావాదేవీలు పుస్తకాల నిర్వహణ చేయడం చూడవలసి ఉంటుంది. ప్రస్తుతం పాత విధానంలో మార్పు తీసు కువచ్చి ప్రతి ఎస్‌హెచ్‌జీసభ్యులు తమ అప్పు, పొదుపులు బ్యాంకు ఖాతాలు చెల్లించి రశీదులు ఇవ్వడం జరుగుతుంది. ఇక్కడ ఆర్థిక లావాదేవీలు సంఘమిత్ర ప్రమేయం ఉండదు. సక్రమ నిర్వహణ పై గ్రామసమైఖ్య నుంచి వారికి జీతాలు చెల్లించడం జరుగుతుంది.

**చేసింది ఇలా :**

సంఘమిత్రాలు మాత్రం అందుకు భిన్నంగా మొక్కుబడిగా సమావేశాలు ఏర్పాటు చేసి తామే సభ్యుల వద్ద నదదు వసూలు చేయడం లేదా తమ వ్యక్తిగత ఖాతాలకు ఫోన్‌పే ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసుకుని నిబంధనలకు విరుద్ధంగానగదు మాయం చేసి సంఘం సభ్యులు చెల్లించలేదని మండల స్థాయిలో లెక్కలు చూపి స్వాహా చేస్తున్నట్లు తెలుస్తోంది. అవగాహన లేని మహిళ సభ్యులు తమ అప్పు చెల్లించడం జరుగుతుందన భ్రమలో బ్రతుకుతున్నారు. ఇలా సంఘమిత్రాలు జేబులు నింపుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.

**ఉన్నతి పథకం :**

మహిళల ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం కొరకు డిఆర్‌డిఏ, వెలుగు, ఎస్సీ కార్పోరేషన్ కలసి ఎస్సీ, ఎస్టీ మహిళ సంఘం సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేని రుణాలు చెల్లించడం జరిగింది. రుణాలు పొందిన మహిళలు వడ్డీ లేకుండా నెల నెల వారు పొందిన మొత్తంను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఐతే సంఘమిత్రాలు చెల్లించిన మొత్తంను బ్యాంకులో జమ చేయకుండ స్వాహా చేస్తున్నట్లు చెబుతున్నారు.

# ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతాం..

..వీఆర్ఓ పై చర్యలు తీసుకుంటాం. తహసిల్దార్

రేణిగుంట జూన్ 22 ప్రభాతవార్త.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. రేణిగుంట మండలం కొత్తపాలెం గ్రామ లెక్క దాఖల సర్వే నంబర్ 99 నందు ఐదు ఎకరాల 25 సెంట్లు భూమిని ఆదివారం ఉదయం జెసిబి లతో చదును చేస్తున్నారని తెలుసుకున్న తహసిల్దార్ హుటా హుటిన అక్కడకు చేరుకుని పనులను నిలిపి వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరిటమే కాక క్రిమినల్ కేసులు పెడతామన్నారు. సదరు ఆక్రమణ స్థలానికి సంబంధించి గతంలో కలెక్టర్ ప్రభుత్వ భూమి అని ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ భూమి నందు ప్రభుత్వ భూమి అని తెలియజేస్తూ బోర్డు నాటడం జరిగిందన్నారు. ఈ భూమికి సంబంధించి జిల్లా ఉన్నతాధికారుల



ఆదేశాల మేరకు ప్రభుత్వ స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మండలంలో అనేక ప్రాంతాల్లో భూములు ఆక్రమణకు గురయ్యాయని వాటిపై కూడా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొత్తపాలెం విఆర్ఓపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థల ఎర్రమరెడ్డి పాలెం వద్ద చెరువు స్థలం ఆక్రమణకు గురవుతుందని తెలుసుకొని తహసిల్దార్ అక్కడకు వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. చెరువు భూమి కొంత భాగం దామినేడు ప్రాంతానికి చెందింది గా గుర్తించి తిరుపతి రూరల్ తహసిల్దార్ కు సమాచారం ఇచ్చారు. సోమవారం తిరుపతి రూరల్ సర్వేయర్, రేణిగుంట సర్వేయర్లతో సర్వే జరిపి నిజ నిర్ధారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రమ రెడ్డిపాలెం చెరువు స్థల ఆక్రమణను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత, రైతు సంఘం నాయకులు దక్కా రమణ, పామాకుల సుధాకర్, రమణయ్య, పులిగోరు వెంకటస్వామి, రాధాకృష్ణ, సుబ్రహ్మణ్యం, కృష్ణ, మోహన్ తదితరులతో పాటుసిపిఎం నాయకులు ఓవి రమణ అడ్డుకున్నారు

## ప్రతిష్టాత్మకంగా "కైలాష్ ధామం"

రోడ్డు ప్రమాదాల నివారణకు "ఫ్లై ఓవర్"
ఎంఎల్ఏ పులివర్తి నాని

చంద్రగిరి, జూన్ 22 ప్రభాతవార్త:



చారిత్రాత్మక చంద్రగిరిలో ప్రతిష్టాత్మక నిర్మాణం కైలాష్ (గోవింద) ధామం అని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక స్వర్ణముఖీ తీరాన నూతనంగా నిర్మిస్తున్న కైలాష్ ధామం నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీర్‌తో పాటు కాంట్రాక్టర్‌తో నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. ఈ క్రమంలో నిర్మాణ పనులపై ఆయన పలు సూచనలు చేశారు. అదేవిధంగా సి.మల్లవరం వద్ద హైవేపై నూతనంగా ప్రారంభించిన ఫ్లై ఓవర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిపై ఆరా తీశారు. జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించేందుకే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

– వైఎస్ఆర్‌సీపీ చంద్రగిరి నియోజక వర్గ సమన్వయ కర్త మోహిత్‌రెడ్డి
రామచంద్రాపురం, జూన్ 22 ప్రభాతవార్త ః



వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తామని చంద్రగిరి నియోజక వర్గ సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుప్పం బాదూరులో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన నియోజక వర్గ సోషల్ మీడియా సమన్వయ కర్త సెంథిల్ కుమార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్ష్యలతో వ్యక్తిగతంగా దాడులు చేయడం బాధాకరమన్నారు. పోలీస్‌స్టేషన్‌ల్లో కేసు తీసుకోక పోవడం కనసీం ఆస్పత్రిలో చేర్చుకోక పోవడం ఏమిటని ప్రశ్నించారు. మా నాన్నను అక్రమంగా లిక్కర్ కేసులో ఇరికించి పైచాచక ఆనందం పొందుతున్నారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి,నాయకులు నిరంజన్‌రెడ్డి,మురగయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, లావణ్య, చంద్రబాబు, నెర్లెపల్లి వెంకటేశు, మారయ్య,భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్పెర్రీ ప్యాకేజింగ్స్‌లో భారీ అగ్నిప్రమాదం

న పాలగుంటలో యూనిట్ రూ.15 కోట్ల విలువైన స్టాక్ ధ్వంసం
న ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు
న అగ్ని ఆపాదించబడింది ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్

**సత్యవేడు, జూన్ 22 ప్రభాతవార్త:** స్పెర్రీ ప్యాకేజింగ్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు విధ్వంసకర అగ్ని ప్రమాదం జరిగింది. లిమిటెడ్, పాలగుంట గ్రామంలో ఉన్న అధునా తన ఈపీఎస్ మౌల్డింగ్ సదుపాయం, యూనిట్ భవనం నిర్మాణం, యంత్రాలు, పూర్తయిన వస్తువుల జాబితాను తీవ్రంగా దెబ్బ తీసింది. 2023లో కార్య కలాపాలు ప్రారంభించిన ఈ కర్మాగారం వోల్టాస్, డైకిన్, అంబర్, డిక్సన్‌లతో సహా కన్స్యూమర్ డ్యూరబుల్స్ సెక్టార్‌లోని ప్రముఖ క్లయింట్‌లకు సేవలు అందించింది. ప్రాథమిక నివేదికల ప్రకారం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఉద్భవించాయి. త్వరగా తయారీ గోడౌన్ ప్రాంతాలను చుట్టుముట్టాయి. దాదాపు 15 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా వేసినప్పటికి, ఎలాంటి గాయాలు, ప్రాణ నష్టం జరగలేదని కంపెనీ ధృవీకరించింది. ఫ్యాక్టరీ యొక్క అంతర్గత అగ్నిమాపక భద్రతా బృందం యొక్క సత్వర చర్య, స్థానిక అగ్నిమాపక సేవలు, పోలీసు సిబ్బంది సకాలంలో జోక్యం చేసుకోవడం దీనికి కారణం, దీనికి యాజమాన్యం ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపింది. దేవుడి దయ వల్ల మా ఉద్యోగులంతా క్షేమంగా కంపెనీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మా విలువైన కస్టమర్లకు నిరంతర మద్దతును నిర్ధారించడానికి వీలైనంత త్వరగా కార్యకలాపాలను పునఃప్రారంభించడం మాతక్షణ ప్రాధాన్యత. అగ్నిమాపక శాఖ అనేక గంటల ప్రయత్నం తరువాత మంటలను అదుపు చేయగలిగింది. యుటిలిటీస్, ముడిసరకు నిల్వలు, టూల్ రూమ్‌తో సహా క్లిష్టమైన మౌలిక సదుపాయాలను విజయవంతంగా రక్షించింది.



## షర్మిల సభ ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా పార్టీ సమావేశంకు నానున్నట్లు జిల్లా స్థానిక నాయకులు ఏర్పాట్లు చేపట్టారు. పట్టణ పొలిమేరల్లోని ఆర్‌జిఆర్ కళ్యాణమండపంలో సమావేశం ఏర్పాటుచేసారు.సభా వేదిక ముస్తాబులో నాయకులు తలమునకలై ఉన్నారు.నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో సమాజానికి నష్టం కల్గిస్తుందని ప్రచారం చేస్తున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గం ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది. ఇక్కడ జరుగుతున్న పాలనపై కాంగ్రెస్ పార్టీ అనుసరించనున్న విధానాలపై కార్యకర్తలకు అనుసరించనున్న విధి విధానాలను వివరించనున్నారు. రాబోవు రోజుల్లోపార్టీని బలోపేతం చేసుకుంటూ విజయం దిశగా పయనించుటకు పిలుపు ఇవ్వనున్నారు. శ్రీకాళహస్తిలో చోటు చేసుకున్న పరిస్థితి సమస్యలను షర్మిలకు వివరించి కార్యకర్తలను పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయుటకు ప్రణాళికలు రూపొందించి పార్టీ అధ్యక్షురాలు షర్మిల చేత చెప్పించనున్నారు.ఈ పరిశీలనల్లో డిసిసి అధ్యక్షులుబాలగురవం బాబు,పిసిసి ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రంభూపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త తలపా దామోదర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శబరి రాజన్ మైనారిటి సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా,దాసరి రత్నం, వీరమోహన్,ఫయాజ్, సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నరుకుతాం, తొక్కుతామంటే ఊరుకోం

తొట్టంబేడు,జూన్ 22 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా బుద్ధిగా మసలుకోకుండా వైకాపా నాయకుడు నరుకుతాం,తొక్కుతామని రంకెలేస్తే ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ముకుతాడో వేసి అదుపులో తెస్తారని శ్రీకాళహస్తి తెలుగుదేశం నాయకులు మీడియా సమావేశంలో వివరించారు. ఆదివారం బిసి రాష్ట్ర నాయకుడు కార్యదర్శి ఉమేష్‌రావు వారి సహచరులు మాట్లాడుతూ నిరుపేద జనాలకు అన్యాయంజరుగుతుంటే నిలదీయటంలో తప్పులేదు కానీ జులాయిలా తిరుగుతూ బెట్టింగ్ కార్యకలాపాలతో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న అక్రమార్కుడికి చావును రాజకీయం చేస్తూ ఓదార్పుకు వెళ్ళటం అభం శుభం తెలియని సింగయ్య కారు బలి తీసుకోవటం దారుణమన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దశరధాచ్చారి, వన్నికుల క్షత్రియుల సంక్షేమ,అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, చిన్నారెడ్డి, సెల్వం, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు, పేటబాలాజిరెడ్డి, మునిరాజాయాదవ్, వజ్రం కిషోర్,యంయస్‌రెడ్డి, అంకయ్యగౌడ్, భాస్కర్ గౌడ్ హరి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

రామచంద్రాపురం, జూన్ 22 ప్రభాతవార్త ః



అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేయిస్తా మని తహశీల్దార్ వెంకటరమణ హెచ్చరించారు. ఆదివారం ఆర్.ఐ లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది టీంగా ఏర్పాటు చేశామన్నారు. మండలంలో పర్యటించి ఇసుక, మట్టి తరలించ కుండా నిఘా ఏర్పాటు చేశామన్నారు. సి. రామా పురం, టి. కండ్రిగ, రాయలచెరువు, నెత్తకుప్పం, అనుప్పల్లి గ్రామాలలో పర్యటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓలు బాబు, ప్రదీప్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీలలో గర్భాశయంలో కలిగే ఇబ్బందులపై అవగాహన

తిరుపతి హెల్త్, జూన్ 22 ప్రభాతవార్త ః



ఎస్వీ వైద్య కళాశాల ప్రసూతి విభాగంలో నిరంతర వైద్య విద్య కార్యశాల కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి వైద్య విద్య కార్యసాలకులు కుప్పం నుంచి పీఈఎస్ వైద్య కళాశాల, కడప నుంచి ఫాతిమా వైద్య కళాశాలల పీజీ వైద్య విద్యార్థులు దాదాపు 259 మంది పాల్గొన్నారు. ప్రధానంగా స్త్రీల గర్భాశయంలో కలిగే కొన్ని ఇబ్బందులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రభు, డాక్టర్లు, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధిరెడ్డి, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## 25న వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో
4,5వ తరగతులకు దరఖాస్తులకు చివరి తేదీ

తిరుపతి క్రీడ, జూన్ 22, ప్రభాతవార్త

వైఎస్సార్ కడపలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4,5వ తరగతులలో ప్రవేశాల కొరకు మరింత మంది విద్యార్ధులకు అవకాశం కల్పించేందుకు గాను ఈ నెల 19వ తేది వరకు ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీని ఈ నెల 25వ తేది వరకు పొడిగించినట్లు వైఎస్సార్ క్రీడా పాఠశాల ప్రత్యేక అధికారి జగన్నాథ రెడ్డి తెలిపారు. అందుకు గాను అర్హులైన తిరుపతికి చెందిన విద్యార్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు హెచ్‌టిటిపిఎస్://ఏపి స్పోర్ట్స్ స్కూల్. ఏపి. జిఓవి.ఇన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## దామలచెరువు మ్యాంగో నగర్‌ను సందర్శించిన



చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని
పాకాల, జూన్ 22 ప్రభాతవార్త

పాకాల మండలం దామల చెరువు మ్యాంగో నగర్ రైతులతో మాట్లాడి సమస్యలపై కూటమి ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు సుమారు 200 కోట్లు చెల్లించేందుకు సిద్ధపడింది అని వారు తెలిపారు. మామిడి రైతులు అధైర్య పడవద్దని చివరి కిలో వరకు కిలోకు 4 రూ అదనపు ధరను ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడి రైతుల కష్టాలు ప్రభుత్వానికి నివేదించాం అందులో భాగంగానే మంత్రి దామలచెరువుకు రావడం జరిగింది అని పులివర్తి నాని పేర్కొన్నారు. గుజ్జు పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడి మరింత రేటు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, వ్యవసాయ శాఖ, ఏపీఎం, ఇతర అధికారులను మ్యాంగో నగర్‌లోనే ఉండి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే కుక్కల పల్లె ప్రజల నీటి సమస్యకు వేంటనే నూతన బోర్ ఏర్పాటు చేసి నీటి సమస్యకు పరిష్కారం చూపాలి అని అధికారులను ఆదేశించారు.

## పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలికిన ఆరణి మదన్

తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాత వార్త



తమిళనాడు రాష్ట్రం మదురైలో హిందూ మున్నానీ సంస్థ నిర్వహించిన మురుగన్ భక్తుల మహానాడులో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం విమానాశ్రయంకు చేరుకున్న జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ కి విమానాశ్రయంలో స్వాగతం పలికిన ఆరణి మదన్.తిరుపతి నుంచి సభలో పాల్గొనేందుకు వందకుపైగా కార్యకర్తులు వచ్చినట్లు పవన్ కళ్యాణ్ కు తెలిపిన ఆరణి మదన్. సభ అనంతరం అందురూ స్వస్థలాలకు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని మదన్ కు సూచించిన పవన్ కళ్యాణ్.

## నేడు వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

తిరుపతి విద్య జూన్ 22 ప్రభాత వార్త



శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల, తిరుపతి నందు నేడు కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం వి రమణ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి విచ్చేయనున్నారని తెలిపారు.వార్షికోత్సవం సందర్భంగా కళాశాలలో చదువుతున్నటువంటి బీఎస్సీ అగ్రికల్చర్, ఎమ్మెస్సీ అగ్రికల్చర్,అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ మరియు పరిశోధన విద్యార్థినీ విద్యార్థులకు వివిధ అకాడమిక్ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు మరియుక్రీడా సాంస్కృతిక సాహిత్య పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందని అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని,విద్యార్థులు అధ్యాపక, బోధ నేతర సిబ్బంది ప్రతి ఒక్కరు పాల్గొంటారని తెలియజేశారు.

## మూడవ రోజుకు చేరిన కార్మికుల నిరసన

తిరుపతి హెల్త్, జూన్ 22 ప్రభాతవార్త ః



మెడికల్ పారిశుధ్య కార్మికుల మూడు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నేతలు కార్మికులతో మెడికల్ కళాశాల అంతా వినూత్న రీతిలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. త్వరలో కార్మికులకు జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. శ్రీను, రైల్వే బాల, అల్లా బక్షా, సునీల్, పద్మ, ఉదయ్, గురమ్మ, వనజమ్మ, కాణిపాకం, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య...

.. రేణిగుంట జూన్ 22 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని జి పాలెం పంచాయితీ ఎస్సీ కాలనీ చెందిన తేజోవతి (37) ఆదివారం కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తేజోవతి కుటుంబ కలహాల వల్ల మనస్థాపానికి గురై ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను దగ్గర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు.విషయం తెలుసుకున్న గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బంది ద్వారా మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి పంపే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు....

## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి...

రేణిగుంట జూన్ 22 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రమరెడ్డి పాలెం డంప్ యార్డ్ వద్ద రెండు రోజుల క్రితం అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతిని కుడి చేతి మణికట్టుపై పోలయ్య అని పచ్చబొట్టు ఉంది. మృతుడు తెల్ల జుట్టుతో దాదాపు 80 సంవత్సరాల వయస్సు కలిగిన యాచకునిలా ఉన్నాడు. ఇంతకుమించి మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ప్రస్తుతం అతని మృతదేహం రుయా ఆసుపత్రి మార్చురీలో ఉందని పోలీసులు తెలిపారు.

## నేసనూరు వడ్డిండ్లు మా పాఠశాల మాకే కావాలి - సీపీఎం ధర్నా

పుత్తూరు రూరల్, జూన్ 22 ప్రభాతవార్త:



పుత్తూరు మండలంలోని నేసనూరు పంచాయతీలోని వడ్డిండ్లు మా పాఠశాల మాకే కావాలని సీపీఎం ఆధ్వర్యంలో పిల్లలు, తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ వడ్డిండ్లు నుంచి నేషనల్‌కు గోపాలకృష్ణాపురంకు 3,4,5 తరగతులను రెండు కి.మీ దూరంలో వెళ్లడానికి పిల్లలు భయపడుతున్నారని అందుకు ఆ స్కూలు అక్కడే ఉండాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆ స్కూల్లో సుమారు 30 మంది పిల్లలు చదువుకుంటున్నారు. రెండంతస్తుల అక్కడ ఉన్నది వీరిని వేరే స్కూలుకు మార్చడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డిండ్ల నుంచి పుత్తూరు రింగ్ రోడ్డు దాటుకుని వెళ్ళవలసి వస్తుందని, ఆ రింగ్ రోడ్డులో ఇరువైపులా బావులు మామిడి తోటలో తాగుబోతులు, వాహనాల్లో వస్తుంటారు, ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడున్న వంటి విద్యాశాఖ అధికారులు విలీనం ఉన్నటువంటి స్కూలు అక్కడే నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు షర్మిల రాక

శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రానున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికలకు ముందు ప్రచారానికి వచ్చిన షర్మిల మళ్ళీ ఇప్పుడు వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కాంగ్రెస్ పార్టీ తీసుకోబోతున్న విధానాలను వివరించుటకు ఆమె వస్తున్నట్లు సమాచారం ఈ మేరకు పార్టీ వర్గాలు పర్యవేక్షిస్తున్నారు. విమాన ప్రమాదానికి ముందు ఆమె శ్రీకాళహస్తిలో పర్యటించనుండగా విమాన ప్రమాదంతో వాయిదా పడింది.ఈ పర్యటన ప్రస్తుతం ఖరారు అయినట్లు ప్రకటించారు.ఇందుకు పార్టీ కార్యకర్తలను సమీకరిస్తున్నారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానం

**శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని విద్యాప్రకాశానంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి ఆదివారం తెలిపారు.జూనియర్ కళాశాల నందు పలు అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వృక్ష శాస్త్రం,జంతు శాస్త్రం సబ్‌జెక్టులకు అతిథి అధ్యాపకులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి అర్హత ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. సంబంధిత సబ్‌జెక్టుల్లో పిజి పూర్తి చేసి బోధనా అనుభవం ఉన్న ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని సుధాకర్‌రెడ్డి వివరించారు.దరఖాస్తులు ఈ నెల 24 లోపల ప్రిన్సిపల్ పేరుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# ఏడేళ్ల సమస్యకు పరిష్కారం: మాస్టర్ ప్లాన్ వేగవంతానికి సుగమనం

**శ్రీకాళహస్తి,జూన్ 22** ప్రభాతవార్త ఎట్టకేలకు మాస్టర్ ప్లాన్‌కు అడ్డంకిగా మారిన భవనాన్ని దేవస్థానం కు అప్పగించుటకు యజమాని అంగీకరించారు. దాంతో మాస్టర్ ప్లాన్‌కు దారి సుగమమైంది. యజమాని పూర్తి స్థాయి రికార్డులను దేవస్థానంకు అప్పగిసే నష్టపరిహారాన్ని దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో చెల్లించుటకు సిద్దం చేస్తున్నట్లు ఇఓ బాపిరెడ్డి తెలిపారు. నష్టపరిహారం విషయంలో బాధితుడు కకూడా సంతోషంగానే అంగీకరించారని ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**భవనం సమస్య తీరింది. మార్గం సుగమమైంది:** ఏడేళ్లుగా మాస్టర్ ప్లాన్ భూసేకరణలో ఒకే ఒక భవనం సమస్య జటిలంగా మారింది. ఆ భవనం యజమాని తనకు నష్టపరిహారం చాలదంటూ కోర్టులను ఆశ్రయించారు.ఈ సమస్య పరిష్కారానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి బాధితునితో పలుమార్లు చర్చించారు. అయితే ఆయన తనకు పరిహారం నేటి ధరల ప్రకారం అందించాలని పట్టుపట్టారు. అయితే ఇఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత రెండు నెలలుగా ఓ వైపు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పనులు చూసుకుంటూ మరో వైపు మాస్టర్‌ప్లాన్ అమలుకు అడ్డంకిగా ఉన్న సన్నిధివీధిలో ఒకే ఒక భవనం సమస్య పరిష్కారానికి పూర్తిగా దృష్టి పెట్టారు. ఒక వేళ యజమాని అంగీకరించినా తరువాత ఆ



భవనంపైఉన్నఅప్పులు,వాటిపరిస్థితులనివేదికలనతెప్పించుకున్నారు

**మంత్రుల ఆదేశాలు, కలెక్టర్ చొరవ:**శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ముందు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,సమీక్షా సమావేశంలో దేవాదాయశాఖ నిధులు మంజూరు చేయటానికి సిద్దమని ప్రకటించగా రెవెన్యూశాఖ మంత్రి తన శాఖకు చెందిన జిల్లా కలెక్టర్‌ను వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దాంతో ఇఓ బాపిరెడ్డి సమావేశం ఏర్పాటుకు అభ్యర్థించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ కమిటి సమావేశం ఏర్పాటు చేసారు. కమిటి సభ్యులతో పాటు లబ్దిదారుని కూడా ఆహ్వానించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ స్పష్టంగా గతంలో కమర్షియల్ భవనాలు కోల్పోయిన ఏడుగురికి ఇచ్చినట్లే నష్టపరిహారం చెల్లిస్తామని స్పష్టం చేసారు. లేకుంటే తాము భూసేకరణకు వెళితే నష్టపోతారంటూ వివరించారు.ఈ నేపథ్యంలోభూమికి నాలుగురేట్లు పరిహారం చెల్లించుటకు, అలాగే కట్టడానికి రెండింతలు పరిహారం చెల్లించుటకు స్పష్టం చేసారు. ఒప్పించిన తరువాత నివేదికలను సిద్దం చేశారు. కమిషనర్‌నెలాఖరుకు లబ్దిదారునికి పరిహారం చెల్లించి భవనం పడగొట్టి మొదటి దశ పనులకు టెండర్లు పిలవటానికి సిద్దం చేస్తున్నట్లు తెలిసింది.

**ఏడేళ్ళ సమస్య పరిష్కారమైంది.:**శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాస్టర్ ప్లాన్ అమలుకు గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నపుడు ప్రకటించారు. అప్పటిలో 2018 వరకు రూ.100కోట్లు నష్టపరిహారాలు చెల్లించి భూ సేకరణ గావించారు. కొత్తగా 3.54 ఎకరాల భూములను కూడా సేకరించారు.అయితే తరువాత వచ్చిన ప్రభుత్వం లో ఐదేళ్ళ పాటు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. కన్సల్టెన్సిల సమీక్షలకే ప్రణాళికలు మార్చటానికే ప్లానకే సొమ్ములు ధార బోసారు తప్ప పట్టించుకోలేదు. ఈ ఫైలు దుమ్ముదులిపిన ఇఓ బాపిరెడ్డి బాధితునితో ఎన్నో సార్లు మాట్లాడారు ఎప్పటి కప్పుడు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎట్టకేలకు సమస్యను పరిష్కారించారు. ఇఓ చొరవను పలువురు అభినందించారు.

## శానిటరీ ఇన్స్పెక్టర్‌ను బదిలీ చేయాలని నిరసన




వెంకటగిరి, జూన్ 22 ప్రభాతవార్త: మున్సిపల్ కార్యాలయంలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వారు మోకాళ్ళ మీద నిలబడి నిరసన తెలిపారు. రాజకీయ అండతో శానిటరీ ఇన్స్పెక్టర్ గత పది సంవత్సరాల నుండి ఇక్కడే రిజిస్టర్ వేసి ఉన్నారని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య తెలిపారు. ఆయనను బదిలీ చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఏసీ సెల్ అధ్యక్షుడుకి నేతలు పరామర్శ



పెళ్లకూరు జూన్ 22 ప్రభాతవార్త : మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కన్నలి వాసు కుమారుడు కన్నడి సాయి కృష్ణకు ప్రమాదానికి గురై మోకాలికి సర్జరీ చేయడం జరిగింది. ఈ విషయంలో సాయి కృష్ణను పరామర్శించడానికి పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పెళ్లకూరు లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించడం జరిగింది. పరామర్శించిన వారిలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పరశురాం ఆత్మకూరు టిడిపి అధ్యక్షులు కిషోర్ కుమార్, ప్రసాద్‌రెడ్డి ప్రసాద్ నాయుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, ముత్యాలయ్య, చక్రపాణి ఉన్నారు.

## ఎన్‌సిసి విద్యార్థులకు అవగాహన



కోట, జూన్ 22 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఎన్‌సిసి క్యాంప్ రెండవ రోజు ఆదివారం నిర్వహించారు. ఎన్‌సిసి క్యాడెట్లకు అధునాతన సైనిక శిక్షణపై కమాండర్ గణేష్ అవగాహన కల్పించారు. నావికా విజ్ఞానం, సముద్ర చరిత్ర, చార్ట్ పని, దిక్సూచి వాడకం, సముద్ర నావిగేషన్‌పై అవగాహన, ఇతర నావికా శిక్షణా నైపుణ్యాలు, ఒత్తిడిలో ఖచ్చితత్వం, ఫైరింగ్, షూటింగ్, సాంస్కృతిక పోటీలు, సంగీతం, జానపద కళాప్రదర్శనలు, పరిశుభ్రత, ఆరోగ్యం, క్రమశిక్షణ తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాడెట్లలో క్రమశిక్షణ, నాయకత్వాన్ని పెంపొందించడంలో ఎన్‌సిసి క్యాడెట్ల పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమరో ఎన్‌సిసి ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఆగిన నగరవనం పనులు



వెంకటగిరి, జూన్ 22 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నగరవనం పనులకు వెంకటగిరిలో గ్రహణం పట్టింది. గత ఆరు నెలల నుండి నగరవరం పనులు ఆగిపోయాయి. ప్రతి మున్సిపాలిటీలో ఒక నగరం ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. అన్ని చోట్ల నగరవనం పనులు పూర్తయిన వెంకటగిరిలో అసంపూర్తిగా ఉన్నాయి. దాదాపు ఒకటిన్నర కోట్ల రూపాయలతో ఈ పనులను చేపట్టారు. మొదటి నుండే నత్త నడకన నగరవరం పనులు సాగాయి. అటవీ శాఖ అధికారులు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేత నగరం పనులకు శంకుస్థాపన చేయించారు. శంకుస్థాపన సమయంలో అప్పటి రేంజర్ లోకేష్ ప్రోటోకాల్ పాటించలేదని వివాదం చెల్లరేకింది. నగరం పనులు నాశరకంగా చేస్తున్నట్లు కూడా విమర్శలు వచ్చాయి. ఎక్కువగా మట్టి పనులు చేసి బిల్లులు స్వాహా చేసినట్లు కూడా విమర్శించారు. పట్టణ వాసులకు అహల్లాదకరంగా ఉండేందుకు నగరంలో ఏర్పాటు చేశారు. అసంపూర్తిగా నగరవరం పనులు ఉండడం వల్ల పట్టణ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఉన్నతాధికారి అయిన చర్య తీసుకుని నగర వనం పనులను పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## సోలార్‌పై అవగాహన కలిగివుండాలి : ఏఈ



నాయుడుపేట, జూన్ 22 ప్రభాతవార్త : ప్రజలు సోలార్ విద్యుత్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగివుండాలని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం నాయుడుపేట పట్టణంలోని ఏఎల్‌సిఐఎమ్ క్రీడామైదానంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈమాట్లడుతూ కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపథకం ద్వార రాయితీపై అందిస్తున్న సోలార్ విద్యుత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఇళ్ళకు సోలార్‌ను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట విద్యుత్‌శాఖ అధికారులు వరప్రసాద్‌రెడ్డి, శివశంకర్, హరికృష్ణ, సురేష్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని మరాద్యపూర్వకంగా కలిసిన నాయకులు



శ్రీకాళహస్తి రూరల్, జూన్ 22 ప్రభాత వార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను, ఏర్పేడు మండలం మునిలిపేడు వద్ద ఆదివారం మర్యాదపూర్వకంగా టిడిపి నాయకులు కలిశారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి దశరాధాచారి దుశ్శాలుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, చిన్నారెడ్డి, సెల్వం, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యం.ఉమేష్‌రావు, పేట బాలాజీరెడ్డి, వజ్రం కిషోర్, మునిరాజా యాదవ్, ఎంఎస్‌రెడ్డి, ఆనంద్, హరి తదితరులు పాల్గొన్నారు.

## రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



గూడూరు, జూన్ 22 ప్రభాతవార్త: గూడూరులోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన బయోలైన్ లేబరేటరీ-రక్త పరీక్ష కేంద్రంను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తక్కువ ధరలకే పరీక్షలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అందరికీ అందుబాటులో ఉండే విధముగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసారని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా ఈ ల్యాబ్ నందు రక్తపరీక్షలు చేస్తారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే, నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, సోమిశెట్టి చెంచురామయ్య, రహీం, వై.శ్రీనివాసులరెడ్డి, పెంచలయ్య, రవీందర్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కారు బోల్తా



పెళ్లకూరు, జూన్ 22 ప్రభాతవార్త : మండలంలోని వడ్డీ పాలెం సమీపంలో 71 వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి సమయంలో తిరుపతి నుండి విజయవాడ వైపు వెళుతున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డుకు ఉన్న సేఫ్టీ గ్రిల్స్‌ను ఢీకొనడంతో కారు ముందు భాగం ప్రమాదానికి గురి అయింది అయితే ఈ ప్రమాదంలో కారుకు ఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పెళ్ళకూరు ఏఎస్ఐ మునుస్వామి ప్రమాద స్థలానికి చేరుకుని రోడ్డు మీద వెళ్తున్న వాహనాలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు

## జాడలేని చేపలు...నిరాశలో మత్స్యకారులు

కోట, జూన్ 22 ప్రభాతవార్త : చేపల వేట విరామం అనంతరం సముద్రంలోకి వెళ్లన మత్స్యకారులకు మత్స్య సంపద లభించక నిరాశకు లోనవుతున్నారు మత్స్యసంపద వృద్ధికి ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు ప్రభుత్వం వేట నిసేదించింది. అనంతరం ఈ అనెల 15 నుంచి గంగపుత్రులు సముద్రంలోకి వేటకు వెళ్తున్నా అరకొరగా చేపలు పడతుండటంతో గిట్టుబాటు కాక నిరాశ చెందుతున్నారు. ఐదేళ్ల వేట నిషేద కాలం అనంతరం సముద్రంలోకి వెళ్తే ఆశించిన దాని కన్నా ఎక్కువగా చేపలు దొరికేవని, ప్రస్తుతం ఆ పరిస్దితి లేదని అంటున్నారు. అయిల్, ఐస్, నిత్యావసర సరకులు, ఇతర వాటికి ఖర్చులు అధికంగా ఉండటంతో కొంత మంది మత్స్యకారులు వేటకు వెళ్లకకుండా ఒడ్డుకే పరిమితమయ్యారు.

## సున్నీసా బేగంకు ఘన సత్కారం



తిరుపతి కలెక్టరేట్, జూన్ 22 ప్రభాతవార్త : ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్ తహ సున్నీసా భేగం నెల రోజులలోనే వివిధ సేవ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నేషనల్ ప్రెసిడెంట్ మాధవి, గంపా నాగేశ్వరరావు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు వారిచేత ప్రశంసలు, బహుమతులు అందుకున్నారు. జాతీయ స్థాయిలో రీజనల్ ప్రెసిడెంట్‌గా తహ సున్నీసా బేగం చేసిన సేవలు అభినందించదగిన విషయం అని మాధవి అన్నారు. గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంపాక్ట్‌లో ప్రతి ఒక్కరూ వాళ్ళ రీజియన్‌లో చాలా మందికి నైపుణ్యతలు నేర్పించే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సభ్యులకు సూచించారు. తహ సున్నీసా భేగం సేవలను గుర్తించి హైదరాబాద్‌లో సన్మానించడం జరిగిందని గుర్తు చేశారు. భేగంకు నేతలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భేగం నేషనల్ ప్రెసిడెంట్ మాధవి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కథం కృష్ణమూర్తి, గంపా నాగేశ్వరరావుకు, నేషనల్ బాడికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## టిడిపి కన్వీనర్ మధురెడ్డికి సన్మానం



వాకాడు, జూన్ 22 ప్రభాతవార్త: మండల టిడిపి నూతన కన్వీనర్‌గా ఎన్నికైన దువ్వూరు మధుసూదన్ రెడ్డికి ఆదివారం టిడిపి మాజీ కన్వీనర్ దువ్వూరు అజిత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాకప్పి, పూల మాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ టిడిపి కన్వీనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, శాసనసభ్యులు సునీల్ కుమార్ ఆదేశాల మేరకు వాకాడు మండల కన్వీనర్ నూతన ఏకగ్రీవ ఎన్నికైన మధుసూదన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. మధుసూదన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు సంతోషం వ్యక్త పరుస్తున్నానన్నారు. ఈ సన్మానంలో నిడిగుర్తి గ్రామ సర్పంచ్ మల్లాపు నాగరాజు, మాజీ ఎంపీటీసీ వెంకటాద్రి, టిడిపి నాయకులు రమేష్, ప్రదీప్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రవిరెడ్డి, నాయకులు కార్యకర్తలు ఉన్నారు. మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చిన ప్రతి నాయకుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద మద్యం షాపులు

నాయుడుపేట, జూన్ 22 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్, మహాత్మగాంధీ విగ్రహాల పక్కన మద్యం షాపులు ఏర్పాటు చేసి అమ్మకాలు చేపడుతున్న సంబంధిత ఎక్సైజ్, పోలీస్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మెరకు పాఠశాలలు, దేవాలయాలు, మసీదులు, చర్చులు పరిసర ప్రాంతాల్లో మద్యం షాపులు నిషేధం అన్న నిబంధనలను తుంగలో తొక్కి నాయుడుపేటలో అందుకు భిన్నంగా ఏర్పాటుచేసి విచ్చలవిడిగా అమ్మకాలు చేపడుతున్నా, ఎక్సైజ్, స్థానిక పోలీసులు అటువైపు కన్నెత్తి కూడ చూడటంలేదని ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా నాయుడుపేట మండలంలోని మేనకూరు వద్ద రహదారిని ఆనుకొని అనధికారిక మద్యం షాపు ఏర్పాటుచేసి క్వాటర్ బాటిల్‌పై అధనంగా 20నుండి 30 రూపాయలకు వరకు వసూళ్ళు చేస్తున్నట్లు మందుబాబులు చెప్తున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త తిరుపతి ఎక్సైజ్ సూపరిన్‌టెండెంట్‌ను వివరణ కోరగా ఆయన వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## సూళ్లూరుపేటలో నేత్రదానాలు



సూళ్లూరుపేట, జూన్ 22 ప్రభాతవార్త: పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు ఆదివారం ఒకే రోజున రెండు నేత్రదానాలు అందాయి. కెఆర్‌పాలెం లోని ఇమ్మనేని సత్యనారాయణరావు (84), అలాగే మన్నారుపోలూరు జగన్న కాలనీ వాస్తవ్యులు పృథ్వీ లీలమ్మ (79)లు మృతిచెందారు. వీరి మరణానంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో వీరి నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. దీంతో సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన మహోద్యమానికి 466 నేత్రదానాలు అందాయి. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్కే కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే



రామచంద్రాపురం, జూన్ 22 ప్రభాతవార్త : రామచంద్రాపురం మండలం కమ్మకండ్రిగమిట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్ పెద్ద నాన్న ఆర్కే నాయుడు కర్మక్రియలకు ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్కే నాయుడు చిత్రపటానికి నాని పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండకు పోటెత్తిన భక్తజనం



బోయకొండ(చౌడేపల్లి), జూన్ 22 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణాల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. కొండ దినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చక, వేదపండితులు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబర్ పర్యవేక్షణలో అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## బడి మానేసిన పిల్లలు తిరిగి బడిలోకి!

### -తల్లికి వందనంతో తల్లిదండ్రుల్లో మేల్కొలుపు




తిరుపతి, జూన్ 22ప్రభాతవార్త: పలుకారణాలతో బడి మానేసిన పిల్లలు తిరిగి బడిలోకి చేరేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేసిన ఆర్థిక సాయం తల్లికి వందనంతో ఇప్పుడు పిల్లలను చదువుకునేందుకు పంపుతున్నారని టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు తెలిపారు. ఇచ్చిన హామీమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ తల్లికి వందనంక్రింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి డబ్బులు సాయం అందించారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆనందం కనిపిపించిందన్నారు. ఈ పథకం వల్ల నిరుపేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తమ పిల్లలను చదువకునేలా ప్రోత్సాహమి చ్చేందుకు దోహదపడుతుందని నగర ఉపమేయర్ ఆర్‌సి మునికృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం తెలిపారు. బడి మానేసిన పిల్లలు తిరిగి బడికి వచ్చేందుకు ఈ పథకం ఆసరాగా మారిందన్నారు. గత ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకున్నా ఒక్కరికే ఆర్థిక సాయం అందించారని, దీనివల్ల మిగిలిన వాళ్ళు చదువుకోలేక దూరమయ్యా రన్నారు. పేదల, బడుగు వర్గాల పిల్లలు చదువుకోవాలనే ఆశయంతో సిఎం చంద్రబాబునాయుడు మంచి మనసుతో పథకం అమలు చేయడంతో తల్లిదండ్రులు కూడా థ్యాంక్యూ సిఎం అంటూ ధన్యవాదాలు తెలియజేస్తున్నారని ఊట్లసురేంద్రనాయుడు చెప్పారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలన్నీ తప్పకుండా అమలుచేస్తుందని అన్నారు. వైసిపి నాయకులు తప్పుడు గ్లోబల్ ప్రచారాన్ని ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు శంకర్, రవిశంకర్‌యాదవ్, పిల్లల తల్లిదండ్రులు పెంచలయ్య,, మల్లికార్జున్, బాలకృష్ణ, గిరి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## 29న సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన



కుప్పం, జూన్ 22 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 29న తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ వర్గాలకు ప్రాథమిక సమాచారం అందింది. 29వతేది శాంతిపురం మండలం శివపురం గ్రామంలో తమ సొంత ఇంటికి సిఎం దంపతులు విచ్చేస్తారని సమాచారం. అదే రోజు శివపురం పరిధిలో ఉన్న సుమారు అరవై కుటుంబాలతో సిఎం తెలుగుదేశం పార్టీ తరపున కుటుంబ సాధికార సభ్యులుగా చర్చించడంతో పాటు వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తదితరాల గురించి వివరిస్తారని సమాచారం. అయితే సిఎం చంద్రబాబునాయుడు దంపతులు ఈనెల 28న కుప్పం వస్తారా లేక 29న వచ్చి తిరిగివెళ్తారా అనేది ఖరారు కావాల్సి ఉంది. గత నెలలో శివపురంలో సిఎం చంద్రబాబు నాయుడు సొంతింటి గృహ ప్రవేశ కార్యక్రమంతో పాటు కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు విచ్చేసిన విషయం విదితమే. మరలా 29న సిఎం పర్యటన ఉంటున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మణికంత చందోలు, కడ పి.డి. వికాస్ మర్మత్‌లు సిఎం పర్యటన విజయవంతానికి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయం కిట కిట...

## సామాన్యభక్తులకు తప్పదు తిప్పలు



శ్రీకాళహస్తి, జూన్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం కిట కిట లాడింది. అయితే ఆలయాధికారులు ఎన్ని సంస్కరణలు అమలు చేసినా సామాన్య భక్తులకు దర్శనం ప్రశ్నార్థకంగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇఒ టి.బాపిరెడ్డి పర్యవేక్షించినా, ఆలయ పరిసరాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. క్యూలైన్ల నిర్వహణపై సమగ్ర పరిశీలన చేయాల్సి ఉంది.

**శ్రీకాళహస్తి చరిత్రలో రికార్డు స్థాయి పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ చరిత్రలో, రాహుకేతుదోష నివారణ పూజలు ప్రారంభించినప్పటి నుంచి లేని విధంగా ఆదివారం రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగాయి. ఆలయం ఆదాయం కూడా గణనీయంగా వచ్చింది. సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక మూడవ గేటు ఎదురుగా రూ.200ల టిక్కెట్లు కౌంటర్‌ను ఏర్పాటు చేసారు. ఒక్కసారిగా 30వేల మంది భక్తులు రావటంతో ఆలయం కిట కిట లాడింది. ఇక అభిషేకాలు పరిశీలిస్తే స్వామి అమ్మవార్ల అభిషేకాలు 107 జరిగాయి. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 26, శనీశ్వరాభిషేకాలు 117 రాహుకేతుదోష నివారణ పూజలు 5698, ప్రవేశ టిక్కెట్లు 7703 జరిగినట్లు ప్రకటించారు. వచ్చిన భక్తులకు సుదర్శనం కల్పించుటకు ఇఒ డి.బాపిరెడ్డి, ఎఇఒ మోహన్, ఎస్‌పిఎఫ్ సిబ్బంది తిప్పలు పడ్డారు.

**త్వరలోనే సమస్య పరిష్కారం: ఇఓ**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల టిక్కెట్లు కొనుగోలుకు సంబంధించిన కౌంటర్లను ఒకటవ, రెండవ ద్వారాల మధ్యలో ఏర్పాటుకు సంబంధించి కమిషనర్ కార్యాలయం నుంచి ఆమోదం లభించిందని, వెంటనే చేపట్టి త్వరలోని ఎవరైనా రెండవ గేటునుంచే ప్రవేశించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరైనాప టిక్కెట్లు అయినా ఇక్కడే కొనుగోలు చేసి పాతాళ వినాయక ఆలయం ఎదురుగా ఉన్న గోపురం నుంచే ప్రవేశించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

## టీటీడీకి ఏసి బస్సు విరాళం



తిరుమల, జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: ఆటో మొబైల్ కంపెనీ అశోక్ లేలాండ్ టిటిడికి ఒక 41సీటర్ ఏసి బస్సును ఆదివారం విరాళంగా అందించింది. సుమారు రూ. 35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ మోటార్స్ సంస్థ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు టిటిడికి అందజేశారు. సాధారణంగా ప్రతి ఏడాది అశోక్ లేలాండ్ కంపెనీ వారు టిటిడి కి ఒక ఆటోమొబైల్ వాహనాన్ని విరాళంగా అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుమల డిపో డిఐ వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ వందేళ్ల చరిత్ర అజరామమైనది

### - సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి



తిరుపతి హెల్త్, జూన్ 22 ప్రభాతవార్త: సీపీఐ వందేళ్ళ చరిత్ర అజరామమైనదని ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి అన్నారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆదివారం మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఐ శత వార్షికోత్సవ సందర్భంగా మొక్కలు నాటడం జరిగింది. హరినాథరెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ అజిరామమైన చరిత్ర కలిగిన సీపీఐ త్యాగాలను, బలి దానాలను పోరాటను కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు శరణ్యమని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల గుర్తించి సమస్యల పరిష్కారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా అన్ని శాఖలలో ప్రకృతిని కాపాడుట కోసం మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళీ, నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. రాధా కృష్ణ, మహేంద్ర, కిషోర్, పురుషోత్తం, సునీల్, మేన, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత




విజయపురం, జూన్ 22 ప్రభాతవార్త : మండలంలోని పన్నూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలి వద్ద గల ఒక ప్రైవేట్ పాఠశాలలో మొత్తం 56 మంది చదువుకుంటుండగా అందులో సుమారు 30 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆస్పత్రి పాలయ్యారు. ఆదివారం మధ్యాహ్నం హాస్టల్లో భోజనం చేసిన తర్వాత పలువురు విద్యార్థులు వాంతులు, విరోచనాలతో అస్వస్థత గురయ్యారు. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది హుటాహుటిన వారిని నగరి ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు అస్వస్థతకు గురైన విద్యార్థులకు తగిన వైద్యం అందిస్తున్నారు. విద్యార్థులకు ప్రాణాపాయం లేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంబంధిత వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న నగర ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నేరుగా ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. తాగునీటి వలనా, ఆహారం కలుషితం వల్లనా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారా అనే కోణంలో రైతులు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## చిరు కాంట్రాక్టర్‌ను కోటీశ్వరుడిని చేసిన వైసీపీ!

### - అతడి అక్రమ సంపాదనపై కూటమి ప్రత్యేక దృష్టి సారించాలి



తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త : గత వైసీపీ ప్రభుత్వం ఓ కంపెనీకి చెందిన సాధారణ కాంట్రాక్టర్‌ను కోటీశ్వరుడిని చేసింది. అదే వ్యక్తిని కూటమి ప్రభుత్వం వెనకేసుకుని రావడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమీషన్ల రూపంలో రూ.వేలాది కోట్లు ముడుపులు చేతులు మారుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి ప్రభుత్వం కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే...దేశంలో ఖజారియా, జాన్సన్, నెక్కో లాంటి తదితర పెద్ద టైల్స్ కంపెనీలు ఉన్నా వాటిని కాదని ఓ కంపెనీకి చెందిన డీలర్, సాధారణ కాంట్రాక్టర్, అతడు ఇచ్చే కమీషన్ల కోసం స్విమ్స్, బర్డ్ ఆస్పత్రులు, తిరుమల కొండపైన కూడా అదే కంపెనీకి చెందిన టైల్స్‌ను 90 శాతం ఉపయోగించినట్లు తెలుస్తోంది. తద్వారా టీటీడీ ఇంజనీరింగ్ విభాగానికి రూ. వేలాది కోట్లు ముడుపులు అందినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందనీ పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దానిపై టీటీడీ యాజమాన్యం ఆ విభాగంపై ప్రత్యేక దృష్టిపెట్టిన విషయం అందరికి విధితమే. 3నుంచి రూ.4లక్షల రూపాయల పనులు చేసుకునే ఓ చిన్న కాంట్రాక్టర్ గత వైసీపీ ఐదేళ్ల కాలంలో రూ. 300 కోట్లు నుంచి రూ. 400 కోట్లు పనులు చేసే పెద్ద కాంట్రాక్టర్‌గా ఎదిగాడని చెప్పక తప్పదు. అతడు ఏకంగా 6 నుంచి 7శాతం కమీషన్లు ముట్టజెప్పి అతడి వైపుకు అధికారులను తిప్పుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై సీఎం నారా చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టి ఆ కాంట్రాక్టర్‌పై తగు విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా అప్పటి మంత్రి నాడు- నేడు కార్యక్రమంలో రూ.8 కోట్లు ముడుపులు డైరెక్ట్‌గా ఆ కంపెనీ నుంచే గత ప్రభుత్వ పెద్దలకు ఇచ్చారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందనేది కొసమెరుపు.